# గాదె కింద ఆయాలు

చిట్టి,పొట్టి ఎంతమంచి స్నేహితులైనా వాళ్ళ ఇష్టాఇష్టాలలో చాలా తేడాలున్నాయ్

వుదాహరణకి , చిట్టికి ముంతకింద పప్పంటే ఇష్టం,

పొట్టికి మిర్చి బజ్జీలంటే ఇష్టం.

చిట్టికి ఫైటింగు పిక్చలర్లంటే ఇష్టం – పొట్టికి క్రికెట్ ఆడేవాళ్ళంటే ఇష్టం.

ఇన్నితేడాలున్నా వాళ్ళిద్దరూ ఒకే ఒక విషయంలో ఏకిభవిస్తారు.

ఇద్దరికి వాళ్ళ స్కూల్లో ఆయాని చూస్తే భయం.

ఆరోజు స్కూలు లంచ్‌టైములో చిట్టి, పొట్టి దూరంగ వున్న చెట్టు నీడన మిగతా వాళ్ళకి దూరంగా కూర్చున్నారు. తెచ్చుకున్న టిఫిన్ కారియెర్లని విప్పేరు.

" ఇవాళ ఏం తెచ్చావురా " అనడిగాడు చిట్టి

" పెరుగూ అన్నం " పెరిగే పిల్లల్ని పెరుగూ అన్నం అన్న పథకం చేపట్టినట్లు పొట్టివాళ్ళమ్మ రోజూ అదే ఇచ్చి పంపిస్తుంది.

" రోజూ పెరుగూ అన్నవేరా – మా అమ్మ చూడ ఎంచక్కా పకోడీలిచ్చింది " అన్నాడు.

పొట్టికి బాధేసింది. సిగ్గేసింది డిపాజిట్టు పోగొట్టుకున్న మంత్రిలాగా తలొంచుకున్నాడు.

చిట్టి అలా అన్నాడేగాని ఆ తర్వాత బాధపడ్డాడు. వయస్సేదైనా తప్పు చేసానన్న బాధ అందరికీ ఒక్కటే . పిల్లలికి ఆ బాధని చెప్పుకోవటం తెలీదు. – పెద్దలు తెల్సినా చెప్పుకోరు.

పొట్టి బాదపడేమనస్సుని శాంతింపచెయ్యటమెలాగాని చిట్టి దిక్కులు చూస్తుండగా ఆ పిల్ల కనిపించింది.

ఆ పిల్లకి అయిదు సంవత్సరాల వయసుంటుంది. కొత్తగా స్కూల్లో జాయినయింది.

చక్కటి కళ్ళు పాలుగారే బుగ్గలు, లక్కపిడతలాగా చిన్న నోరు, అమాయకంగా , అందంగా వుంది. భుజానికిఇ పుస్తకాల సంచి వాటర్ బ్యాగ్ , చేతిలో స్టీలు టిఫిన్ డాబ్బాలతో దూరంగా ఒక్కర్తే నిల్చుని తీరుబడిగా వెక్కి వెక్కి ఏడుస్తోంది.

" రేయ్  పొట్టి  ఆ పిల్ల  చూడ్రా పాపం  – ఎలా ఏడుస్తోందో  " అన్నాడు తలొంచుకు కూర్చున్న మిత్రుడితో ..

పొట్టి  తలెత్తి  అటువైపుగా  చూసేడు.

నిజమే  ఏడుస్తోంది అయితే – అన్నట్లుగా  చూసాడు  పొట్టి  చిట్టి వంక

" పదరా – ఎందుకేడుస్తోందో  కనుక్కుందాం  " అంటూ  చిట్టి లేవడంతో పొట్టిగూడా  కదిలాడు.

ఇద్దరూ పుస్తకాలు , టిఫిన్  డబ్బాలు  అక్కడే  వుంచేసి  ఆ పిల్ల నిల్చున్న వైపుగా వెళ్ళారు.

ఆ పిల్ల  వీళ్ళిద్దరినీ  చూసి  ఎందేకనో  శ్రుతి  పెంచింది.

చిట్టికి ఇంట్లో అదే వయసు చెల్లెల్ని  సముదాయించే  అనుభవముంది.  అంచేత నేర్పుగా  " ఏంటమ్మా  – ఎందుకేడుస్తున్నావ్ " అన్నాడు లయగా.

ఆ పిల్ల  ఏడుపునాపుకుంటూ  " ఆయా  నా డబ్బాలో  అన్నవంతాతినేసింది " అంది ఖాళీగా  వున్న టిఫిన్ని చూపిస్తూ

చిట్టి బాలకృష్ణుడిలా  పొట్టివంక  చూసేడు. పొట్టి బలరాముడుడిలా చిట్టివంక చూసేడు.

ఆ ఇద్దరి  మనసుల్లోను చెప్పలేని అలజడి  అనిపించింది – ఆ పిల్లని   చూస్తుంటే జాలనిపించింది – ఇద్దరూ  కళ్ళతోనే  చర్చించకున్నారు.

చిట్టి  ఆ పిల్లలతో " పోన్లే  – ఏడవక –  మాతో  రా ఎంచక్కా  పకోడీలు , పెరుగన్నం తిందాం " అన్నాడు.

ఆ పిల్ల  ఆ మాట వినంగానే ఏడుపాపి  , కళ్లు తుడచుకుని , చిట్టి చెయ్యి పుచ్చుకుంది.

ముగ్గురు  తిరిగి  చెట్టుక్రిందకి చేరారు. చిట్టి  పొట్టి పోటీలు పడి  ఆ పిల్లచేత తినిపించారు.  ఎన్నో కబుర్లు  చెప్పారు.  ఆపిల్లముందు  వాళ్ళిద్దరూ  చాలా పెద్దరికాన్ని ప్రదర్శించారు.

అయిదు నిమిషాల్లో  ఆ పిల్ల మునుపటి  బాధంతామరచి  వెన్నెల  రేకులా నవ్వింది.

పదినిమిషాల్లో తినటం పూర్తయింది. డబ్బాలకి మూతలు  బిగించుకుని  సంచులు తీసుకుని  బయల్దేరారు క్లాసువైపుగా . ఆపిల్లని గూడా  నడిపించుకుంటూ  తీసికెళ్ళి క్లాసులో దింపేరు.

ఆపైన చిట్టిపొట్టి వాళ్ళ తరగతి వైపుగా వెడుతుండగా  ఆయా కనిపించింది. అరుగుపైని చతికిలపడి  కూర్చుని  ఆకులకి సున్నం  దట్టిస్తోంది.

దాన్ని చూడంగానే  చిట్టికి కోపం భగ్గుమంది. వీలైతే దాని ప్రాణాలు  వాటర్ బ్యాగ్‌లో  నీళ్ళులా  గడగడా తాగెయ్యాలనిపించినా  అది సాధ్యం కాదు కాబట్టి  ఒకే ఒక క్షణం  చిన్ని బుర్ర పెట్టి పెద్ద ఆలోచనే చేసేడు.

పొట్టి నడుస్తున్న వాడల్లా ఆగిపోయి చిట్టివంక  అయోమయంగా చూస్తున్నాడు.  " ఇప్పుడే  వస్తానుండు " అన్చెప్పి చిట్టి మేడమెట్ల  క్రింద నున్న  చిన్నగూడులోకి పరుగు తీసేడు . అది  గూడు కాదు – గుహ – ఆయాది.

రెండు క్షణాల్లో తిరిగిచ్చి  " పదపోదాం  " అన్నాడు చిట్టి

పొట్టి  అర్థంకాక " ఏం చేసావక్కడ " అనడిగాడు.

చిట్టి రహస్యం చెబుతున్నట్లుగా  " ఆయా  ఆకులేస్తుందిగా అక్కడ మెట్లకింద  దాని సున్నం డాబ్బా వుంది  – దాన్నిండా ఇసుక పోసొచ్చా  " అన్నాడు కసిగా.

పొట్టికి భయం వేసింది – ఇద్దరూ క్లాసులోకెళ్లారు.

పదినిమిషాల  తర్వాత పరాగ్గా వున్న పొట్టిని తట్టి అటు చూడమన్నాడు చిట్టి. ఆయా సగం  నమిలిన ఆకుల్ని వుమ్మేసి,  అసహ్యంగా మొహం పెట్టి నోరు కడుక్కుంటోంది.

అది చూసి చిట్టి పొట్టి నవ్వుకున్నారు.

------- అయ్యిపోయింది -------